లాఠీ వదిలి.. పాఠం చెబుతూ

కుంటాల: వారంతా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినప్పటికీ కలల కొలువు కోసం మళ్లీ సన్నద్ధమై విజేతలుగా నిలిచారు. ఓ వైపు డ్యూటీ చేస్తూనే.. తీరిక సమయంలో పుస్తకాలతో కుస్తీ పట్టారు. నిన్నటివరకు ప్రజారక్షణకు లాఠీ పట్టిన పోలీస్ కానిస్టేబుళ్లు.. ఇప్పుడు బడికి వెళ్లి పాఠాలు చెబుతూ విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల డీఎస్సీ-2024 ఫలితాల్లో ప్రతిభ చాటిన పలువురు కానిస్టేబుళ్లు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. యువత సమయం వృథా చేయొద్దని.. పనిచేస్తూ పోతే ఫలితం దానంతట వస్తుందని సూచిస్తున్నారు ఈ కొత్త గురువులు.


కుభీర్ మండలం జుండాలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు గీత్‌కుమార్

- ఎస్జీటీలుగా ఎంపికైన కానిస్టేబుళ్లు
- యువత సమయం వృథా చేయొద్దు
- పట్టుదల, ప్రణాళికతో లక్ష్యం దిశగా సాగాలని సూచన

- కడెం మండలంలోని అంబారీపేట్‌కు చెందిన అల్ల ముల భాస్కర్ 2018లో పోలీస్‌శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై నిర్మల్‌లో విధులు నిర్వర్తించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికై దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు.
- కడెం మండలం కల్లెడకు చెందిన ఓంసాయి 2018లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై భైంసా టౌన్‌లో పనిచేశారు. ప్రస్తుతం అంబారిపేట పాఠశాలలో ఎస్జీటీగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.
- కడెం మండలం బెల్లాల్ హరిజనవాడకు చెందిన మైథిలి 2020లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశారు. ఇదే మండలంలోని దుబ్బతండా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా చేరారు.
- నిర్మల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఆనంద్ గీత 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికై జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేశారు. ప్రస్తుతం లోకేశ్వరం మండలంలోని రాజురా పాఠశాలలో ఎస్జీటీగా చేరారు.
- సారంగాపూర్‌కు చెందిన సూర్య శ్రీకర్ 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికై భైంసాటౌన్‌లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కుభీర్ మండలం కస్రతాండలో ఎస్జీటీగా పని చేస్తున్నారు.


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న గాజుల ప్రవీణ్ (ఫైల్)

- కుంటాల మండలంలోని అంబుగామకు చెందిన గీత్‌కుమార్ 2023లో పోలీసు ఉద్యోగానికి ఎంపికై మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల ఎస్జీటీగా ఎంపికవడంతో కుభీర్ మండలంలోని జుండా పాఠశాలలో ఎస్జీటీగా చేరారు.
- కుంటాలకు చెందిన గాజుల ప్రవీణ్ 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికై భైంసాటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. ప్రస్తుతం బెల్గాం పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు.

అమ్మానాన్న కష్టంతోనే..


మా అమ్మానాన్న శోభ-పండరి కష్టంతోనే ఈస్థాయికి వచ్చా. అమ్మ బీడీలు చుడుతూ.. నాన్న హోటల్ నడుపుతూ కొద్దిపాటి వ్యవసాయం చేస్తుండేవారు. చదువే మన బతుకుల్ని మారుస్తుందనే వారి మాటల్ని బలంగా నమ్మి కష్టపడ్డా.. విజేతగా నిలిచా.

– గాజుల ప్రవీణ్, కుంటాల

ప్రణాళికతో సాధించా..


మాది గిరిజన గ్రామం. మా తల్లిదండ్రులు నిర్మలాబాయి–నరేందర్. మాకు భూమి లేదు. కానీ కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవారు. ఆరుగాలం కష్టపడుతూ నన్ను ప్రయోజకుడిగా తీర్చిదిద్దారు. ప్రణాళికతో ముందుకుసాగి టీచర్ కొలువు సాధించా.

– గీత్‌కుమార్, అంబుగామ

చదువుతోనే గౌరవం..


మా అమ్మానాన్న గంగవ్వ– రాజనర్సయ్య వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. చదువుతోనే గౌరవం లభిస్తుందని తరచుగా చెప్పేవారు. కానిస్టేబుల్‌గా ఎంపికైనా.. టీచర్ ఉద్యోగమే లక్ష్యంగా చదివా. కోరిక నెరవేరడం సంతోషంగా ఉంది.

– మైథిలి, బెల్లాల్

లక్ష్యంతో ముందుకుసాగాలి..


మా తల్లిదండ్రులు లక్ష్మి–దుబ్బయ్య. మాది వ్యవసాయ కుటుంబం లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడితే ఫలితం దానంతట అదే వస్తుంది. పోలీస్‌గా ఎంపికైనా తీరిక వేళల్లో ప్రిపరేషన్ కొనసాగించి టీచర్ కొలువు సాధించా.

– ఓం సాయి, కల్లెడ

నాన్నే స్ఫూర్తి..


నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేవిరాజేశ్వర్–అమ్మ ఇందిర. నాన్న కష్టపడి చదవాలని చెప్పేవారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగా. ఎప్పుడు ప్రిపరేషన్ సాగించినా ప్రయత్నలోపం లేకుండా చూసుకున్నా.

– సూర్య శ్రీకర్, సారంగాపూర్

కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో..


మా అత్తామామ రాధాబాయి–నారాయణ పటేల్, భర్త నవనీత్ కుమార్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కొలువు సాధించా. ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే రెండో ప్రయత్నంలో డీఎస్సీలో ఎంపికయ్యా.

– ఆనందగీత, నిర్మల్

గ్రూప్‌-4కు ఎంపికైనా..


మా అమ్మానాన్న నర్సవ్వ–మల్లేశ్. గతంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించా. ఇటీవల గ్రూప్‌–4లో 80వ ర్యాంకు వచ్చింది. అయినప్పటికీ ఇష్టమైన టీచర్ కొలువులోనే చేరిన.

– భాస్కర్, అంబారీపేట

క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


నర్సిరెడ్డికి చిత్రపటం అందిస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్‌లో దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన మాడూరి నర్సిరెడ్డి రూ. 1,01,000లను విరాళంగా అందించారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన మాడూరి నర్సిరెడ్డి వానల్‌పాడ్‌లో స్వయంభుగా వెలిసి న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళాన్ని గ్రామస్తులకు అందించారు. అనంతరం గ్రామస్తులు ఆయనకు అమ్మవారి చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో ముత్యంరెడ్డి, పలువురు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

కడెం: మండలంలోని కొలాంగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు శనివారం లింగాపూర్ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మి, తదితరులున్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో కార్గిల్ పెద్దనర్సయ్య అనే రైతుకు చెందిన గేదె శనివారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. భోసి శివారులోని శిరాల వైపు శివారు ప్రాంతంలో గేదె మేస్తుండగా బోరు మోటారుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

మైక్‌సెట్ అందజేత

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామంలోని శ్రీశివ మార్కండేయ ఆలయానికి మాజీ సర్పంచ్ చిన్నం లావణ్య–రవీందర్ దంపతులు మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. శనివారం ఆలయంలో కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, భీమలింగు, మార్కండేయులు, గంగన్న, లింగన్న, రవి, రమేశ్, లింగేశ్, ప్రవీణ్ తదితరులున్నారు.

పశువులకు టీకాలు

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో శనివారం ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి శ్రీకర్ రాజు మాట్లాడుతూ పశుపోషకులు తప్పనిసరిగా జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'


మాట్లాడుతున్న నాయకులు

మామడ: ఎస్సీ వర్గీకరణ చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు రంజిత్, కుంటోళ్ల వెంకటస్వామి అన్నారు. శనివారం మండలంలోని పొన్కల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి గ్రామకమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కాల్వ అశోక్, ఉపాధ్యక్షుడిగా మెట్టు సుధాకర్, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్, సభ్యులుగా హరీశ్, రమేశ్, విజయ్, స్వామి, శ్రీనివాస్, అడెల్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బొడ్డు లక్ష్మణ్, గంగన్న, రత్నయ్య, రవీందర్, లింగన్న తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వచ్చేనెల 12 నుంచి 16 వరకు నిర్వహించే 40వ బ్రహ్మోత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కౌన్సిలర్ కిశోర్‌నాయక్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అడ్డగట్ల రాజన్న, నిమ్మల రమేశ్, నాయకులు అన్వేశ్, టి.లక్ష్మణ్, ఎల్.రాము, సుధాకర్, భీమన్న, లక్ష్మణ్, జూని, సురేశ్, శేషాద్రి, చైతన్య, ఫణిందర్, శంకర్ తదితరులున్నారు.

ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి


రసీదు ఇస్తున్న ఎంపీడీవో గంగాసాగర్

మామడ: గ్రామపంచాయతీల్లో ఇంటిపన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవాలని ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి.. సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని లింగాపూర్ సందర్శించారు. ఈసందర్భంగా పంచాయతీలో రికార్డులు పరిశీలించి పన్నులు చెల్లించిన పలువురికి రసీదులు అందించారు. అనంతరం నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్డు నిర్వహణ, పునికివనం పరి శీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి కల్యాణి ఉన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి

భైంసాటౌన్: భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉమ్మడి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు దిగంబర్ మాశెట్టివార్(90) శనివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండగా..హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం భైంసాలోని ఆయన నివాసంలో పార్థివదేహం సందర్శన ఉంటుందని, అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. దిగంబర్ మాశెట్టివార్ మృతిపై ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ సంతాపం తెలిపారు. భైంసా ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సరస్వతీ శిశుమందిరాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

భైంసాటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని పలు ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, మండలాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు


కూచన్‌పెల్లిలో అమ్మవారి ఆలయం

సోన్: మండలంలోని కూచన్‌పెల్లిలో నూతనంగా నిర్మించిన శుక్రవారందేవుడి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. దేవాదాయశాఖ నిధులు రూ.16 లక్షలతో ఆలయం నిర్మించి నవగ్రహాలు ఏర్పాటు చేయగా.. ఈనెల 25(శుక్రవారం) నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం ఆర్మూర్ గురుస్వామి బల్యపల్లి సుబ్బరావు బృందం ఆధ్వర్యంలో భక్తులు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆ తర్వాత ఆలయాన్ని గోదావరి జలాలతో శుద్ధి చేశారు. అనంతరం గణపతిపూజ, పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, దేవతలకు ఆహ్వానం, నవగ్రహ వాస్తుపూజ, శనావతి అర్చనతోపాటు 108 కలశాలతో అభిషేక స్నానం నిర్వహించారు. భక్తులకు మహాఅన్నదానం ఏర్పాటు చేశారు. చివరిరోజు ఆలయంలో విగ్రహ ప్రతి ష్ఠాపన ఉంటుందని.. భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


పుణ్యవచనంలో పాల్గొన్న మహిళలు

ఘనంగా దీపోత్సవం


పాల్గొన్న మహిళలు

కుంటాల: దామోదర మాసోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో శనివారం రాత్రి నెయ్యి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో హాజరై యశోదా దామోదర సహిత చిత్రపటాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అర్చకులు రామానుజదాస్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

3న మహా సమ్మేళనం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్(జి): హైదరాబాద్‌లోని ఆదిభట్ల పీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వచ్చేనెల 3న ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రవీందర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ నుంచి మన్మద్ వెళ్లే రోడ్డు మార్గంలో ముళ్లపొదలను లోకేశ్వరం ఎస్సై అశోక్ శనివారం పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ముళ్లపొదలతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో ఎస్సై సొంత ఖర్చులతో పొక్లెయిన్‌ను రప్పించి ముళ్లపొదలను తొలగించారు.

స్వచ్ఛందంగా ముధోల్ బంద్


మూసి ఉన్న వ్యాపార సముదాయాలు


ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

ముధోల్: ఇటీవల సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి ప్రతిమను ధ్వంసం చేసినందుకు నిరసిస్తూ శనివారం ముధోల్‌లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వ్యాపారులు, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ పాటించడంతో బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. అనంతరం ఉత్సవ కమిటీ, హిందూవాహిని, బీజేపీ నాయకులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేవతల విగ్రహాలను ధ్వంసం చేసి హిందూ సంస్కృతిని నాశనం చేయాలనే దుర్మార్గపు చర్యను నిరసిస్తూ బంద్ పాటించినట్లు నాయకులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లింబా(బి), అంబకంటి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణం, డైరెక్టర్లు గోనె గజ్జారాం, సురేశ్, ఏఈవోలు శ్రీనివాస్, హర్షిత, జీవీరమణారావు, వెంగళరావు, సుధాకర్, నవీన్, భాస్కర్, సుదర్శన్ పటేల్, దత్తుపటేల్, మెల్ల సాయిలు, ముత్తేశ్, వీవోఏ గౌతం తదితరులున్నారు.

చెక్కు పంపిణీ..

మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన తెనుగు లక్ష్మికి రూ.33 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తెనుగు చిన్నయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట వెంగల్‌రావు, జీవీరమణారావు, చెన్న మహేశ్, సుదర్శన్ పటేల్, ఎగ్గం గజ్జారాం, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

రైతులు మోసపోవద్దు..


కుంటాల : అంబకంటిలో కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నర్సాపూర్(జి): రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని నందన్, చాక్‌పల్లి, డొంగుర్గాం, బూరుగుపల్లి(కె) గ్రామాల్లో డీసీఎంఎస్, గొల్లమాడ గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, బీ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2300 చెల్లిస్తారని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు జీవి రమణారావు, చెన్న మహేశ్, వినోద్‌రెడ్డి, లక్ష్మణ్‌పటేల్, గోంద్ర సాగర్, అడ్డిగ సంతోష్, కేంద్రం ఇన్‌చార్జులు నార్వాడే ప్రవీణ్‌పాటిల్, గోంద్ర సంతోష్, జంగిపల్లి సంతోష్, కల్యాణ్‌కర్ ప్రవీణ్ పాటిల్ రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరం ఉండాలి

సోన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలని ఎంఈవో పరమేశ్వర్ అన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జాఫ్రపూర్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. మత్తు పదార్థాలను వినియోగిస్తే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేష్ కుమార్, ముత్తన్న, ఆసిఫ్ అలీ, అనిత, విజయమాల, రవితేజ, విద్యార్థులు ఉన్నారు.

ఎల్వి పాఠశాలలో..

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరించే పోస్టర్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం శంకర్ హజారే అవిష్కరించారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లోని చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి శిక్షణ కేంద్రంలో ఇటీవల శిక్షణ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయులు ఎస్.భూమన్నయాదవ్ మాట్లాడారు. మాదకద్రవ్యాల నియంత్రణకు తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు సమాజాన్ని చైతన్య పర్చాలని పేర్కొన్నారు. సుదర్శన్, రజినీకాంత్, రాజేందర్, సుజాతదేవి, లక్ష్మి, శిరీష్, హరిత్, సుధాకర్, శివకుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


జాఫ్రపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో పరమేశ్వర్, ఉపాధ్యాయులు

'బీజేపీ సభ్యత్వ నమోదు పూర్తిచేయాలి'

ఖానాపూర్: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని ఆ పార్టీ సభ్యత్వ రాష్ట్ర పరిశీలకులు రావుల రాంనాథ్ అన్నారు. శనివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అధిక స్థానాలు గెలుచుకునేలా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక.. హైడ్రాను తీసుకొచ్చిందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని.. తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు సూచించారు. సమావేశంలో నాయిని సంతోశ్, టేకు ప్రకాశ్, పుప్పాల ఉపేందర్, సందుపట్ల శ్రావణ్, బొప్పారపు సత్యవతి, గడ్డం రవీందర్, రవి, పిట్టల భూమన్న, అశోక్, స్వామి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంనాథ్

కలెక్టర్ సూచనతోనే కొనుగోలు కేంద్రం ప్రారంభించాం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచనతోనే ప్రారంభించినట్లు నిర్వాహకులు నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వడ్యాల్‌లో కేంద్రం ప్రారంభోత్సవానికి తనకు సమాచారం ఇవ్వలేదని.. నిర్వాహకుడు నవీన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జానకి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తహసీల్దార్ జానకితో మాట్లాడారు. గతంలోనూ ఎప్పుడు తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వలేదని.. తమపై ఫిర్యాదు చేయడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, రాజేశ్వర్, నరేశ్‌రెడ్డి, నారా గౌడ్, ప్రతాప్‌రెడ్డి, పోతారెడ్డి, రజనీకాంత్, షేక్ కలీం, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.